

# ప్రేమకి నిర్వచనం

డి. కామేశ్వరి

"యువర్ ఆనర్!" పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొంతు ఖంగున వినిపించి త్రుళ్ళిపడి తలెత్తింది సుజాత. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తనని వేలుపెట్టి కోర్టు కంతటికీ చూపిస్తున్నాడు. లోకానికంతకీ దోషిగా చూపిస్తున్న అతన్ని చూసి అదో రకంగా నిర్లిప్తంగా నవ్వింది సుజాత.

"యువర్ ఆనర్!-ముద్దాయి సుజాత యింత చిన్నవయసులో వుండి, యింత అమాయకంగా కనిపిస్తున్న యీమె - తను ఒక స్త్రీ అయివుండి సాటిస్త్రీని పసుపుకుంకాలకి, నోరెరుగని యిద్దరు పసిబిడ్డలకి తండ్రిని దూరంచేసిన హంతకురాలు అంటే మీలో ఎంతమంది నమ్మగలరు? కాని యిది అక్షరాల నిజం. ముద్దాయి సుజాత ప్రఖ్యాత రచయిత అయిన ఆనందరావుని అమానుషంగా హత్యచేసింది. అదిగో అటుచూడండి.

భర్తని కోల్పోయిన అభాగ్యురాలు ఎలా కంటికీ మింటికి ఏకధారగా ఏడుస్తూందో చూడండి."

కోర్టులో అందరికళ్ళు హతుని భార్య మీదకి తిరిగి సానుభూతి కురిపించాయి. సుజాతని తిరస్కారంగా, ఏహ్యంగా చూశారు. కోర్టులో కలకలం బయలుదేరింది. 'ఆర్డర్, ఆర్డర్' జడ్జిగారు హెచ్చరించాక కోర్టులో నిశ్శబ్దం ఆవరించింది. సుజాత తలవంచుకుంది. తను హంతకి! హంతకా! అవును. హంతకనే అంటారు గామోలు. ఆనందరావుని తన ఆనంద్‌ని...తను హత్యచేసింది. ఆమాట తల్చుకుంటే ఆమె పెదాలమీద చిన్ననవ్వు మెదిలింది.

'యువర్ ఆనర్!' పబ్లిక్ ప్రాసిక్యూటర్ కథనం మొదలయింది.

"ఈ ముద్దాయి సుజాత అయినింటి పిల్ల. చదువుకుని ఉద్యోగంచేస్తున్న ఇరవై నాలుగేళ్ల అవివాహిత యువతి. ఆనందరావు కవితలు, రచనలు చదివి అతని రచనల మీద గౌరవాన్ని, ఆరాధనని పెంచుకుంది. కవిగా రచయితగా అతనిపట్ల ఆమెకి ఆరాధన వుండేది. ఆ ఆరాధన అతనితో పరిచయం పెంపొందించుకోవాలన్న కోర్కెగా మారటంతో అతనికి ఒక ఉత్తరం వ్రాసింది. అతనితో కలం స్నేహం పెంపొందించుకుందనడానికి హతుని దగ్గిర దొరికిన వుత్తరాలవల్ల తెలుస్తూంది. ఇరువురిమధ్య కలం స్నేహంగా ఆరంభమయిన ఆ స్నేహం తరువాత మంచి స్నేహంగా మారిందనడానికి యీ ఉత్తరాలే సాక్ష్యం- యిదిగో కోర్టువారి పరిశీలనార్థం ఎగ్జిబిట్ నంబర్ వన్‌గా యీ ఉత్తరాలు కోర్టువారికి దఖలు పరుస్తున్నాను.'' ఒక ఉత్తరాల కట్ట కోర్టు గుమాస్తాకి అందించాడు ప్రాసిక్యూటర్.

—నీలిరంగు కవర్లు. ఆ ఉత్తరాలు. అవేగా తమని యింత దగ్గిరచేసాయి. నీలిరంగు కాగితంమీద నీలాలు జల్లినట్లుంటాయి మీ అక్షరాలు అన్నాడు ఆనంద్. ఆనంద్ మొదటి ఉత్తరం - యిప్పటికీ ప్రతి అక్షరం గుర్తుంది. మొదటి ఉత్తరం అన్న మాటేమిటి ప్రతీ ఉత్తరం తన గుండెలలో పదిలపరుచుకుంది. ఆ మొదటి ఉత్తరం చూసుకుని ఎంత గర్వించింది. ప్రఖ్యాత రచయిత తనకి జవాబిచ్చి నందుకు ఎంత పొంగిపోయింది. 'అభిమానించి ఉత్తరాలు అందుకోడం మొదటిసారి కాకపోయినా మొదటిసారిలా థ్రిల్ ఫీలయ్యాను మీ ఉత్తరం చదివి! ముత్యాలలాంటి మీ అక్షరాలు మురిపించాయి నన్ను. అక్షరాలే కాదు అర్థమూనూ. మండుటెండ తర్వాత జల్లు కురిస్తే ఆ హాయి ఆసువాసనలలా అన్పించింది మీ ఉత్తరం! యింత చక్కని ఉత్తరం రాయగల్గిన మీరు రచన లెందుకు చెయ్యరు?!—' అంత చిన్న ఉత్తరంలో ఎంత భావం!

ఎంత ఆనందం!—ఉప్పొంగి పదిలంగా దాచుకుంది. దానికి జవాబు రాసింది. మళ్ళీ ఉత్తరం వచ్చింది. అలా మొదలైన ఆ ఉత్తరాలు ఆరునెలల్లో ఎన్ని అయ్యాయో! ప్రతి ఉత్తరం ఓ మధుర కావ్యం లాంటిది! ఆ భావాలు, ఆ అనుభూతులు, ఒకరిని ఒకరు మెప్పించాలన్నట్టు పోటీపడి రాసినట్లు ఎంత భావస్ఫూర్తితో వుండేవి! కోట్ల విలువచేసే ఆ ఉత్తరాలు తనకి ప్రాణం అయ్యాయి! అంతటి ఉత్తరాలు అందించిన ఆ వ్యక్తి అంతకంటె ప్రాణం అయ్యాడు. తన ఆరాధన తనకి తెలియకుండానే అనురాగంగా మారిపోయింది.

—"ముద్దాయి సుజాత, హతుడు ఆనందరావుల మధ్య కలం స్నేహంగా ఆరంభమయిన పరిచయం ఆరునెలలు తిరిగేసరికి ప్రేమగా మారినట్లు యీ ఉత్తరాలే చెపుతున్నాయి. పరిచయం ఆరంభమయిన ఆరు నెలల తరువాత మొదటిసారి ముద్దాయిని చూడడానికి వచ్చి ఓ హోటల్లో కలిశాడు." ప్రాసిక్యూటర్ మాటలు సుజాత ఆలోచనల మధ్యనుంచి వినిపిస్తున్నాయి.

—అవును. ఆరోజు. తన జీవితంలో మరపురాని మధురాతి మధురమైనదినం! "సుజా, మై డియర్! ఊహలలోయింతగా మురిపిస్తున్న నీవు ప్రత్యక్షంగా యింకెంతెలా అలరిస్తావో నన్న ఊహ, నిన్ను చూడాలన్న కోరికను రోజురోజుకీ పెంచుతూంది. నీ ఉత్తరాలలో నీ ఊహంత నాజుగ్గా అందంగా, నీభావాలు కురిపించే సువాసనల జాజిమొగ్గలా ముట్టుకుంటే కందిపోతావో చూడాలని వుంది. చూడకుండా వుండగలగడం యింక నా వశంలోలేదు. వస్తున్నా నా ఊహల ప్రేయసిని చూడడానికి:—" ఆ ఉత్తరం చదివి ఆనందం, ఆరాటం, ఆందోళన, ఉత్సుకత, ఉత్సాహం, భయం అన్నీ కలిసి కంగారు పెట్టేశాయి. ఆనంద్ వస్తున్నాడు. వస్తాడు. తనని చూస్తాడు. చూస్తాడు. ఏమనుకుంటాడో! ఊహా ప్రేయసీ—ఆ ఊహాప్రేయసితో తను పోటీకి నిలబడగలదా? నెగ్గగలదా! ఆనంద్ ఎలావుంటాడో! ఎలావుంటేనేం? తనకి కావల్సింది అతని మనసు! ఆ మనసు ఎంత ఆనందంగా వుంటుందో, ఆ మనసు వినిపించినరాగాలు ఎంతమధురమో తనకి తెలుసు! ఆనంద్ వస్తాడు. వచ్చి...తరువాత జరగబోయేది మన ఊహల కందనిది. ఆనంద్‌కోసం ఎదురు చూసిన ఆ వారం ఎన్నటికీ కదలనట్లనిపించింది. ఆఖరికి అనుకున్న క్షణం రానేవచ్చింది. ఆ రోజు ఆ క్షణాలు ఎంత ఎండిపోయిన బ్రతుకునైనా చిగిరింపచెయ్యడానికి! ఏదో అపురూప దృశ్యం చూస్తున్నట్టు కొన్నిక్షణాలు అచేతనులయి నిలబడిపోయారు! ఆశించినదాని కన్న మిన్నగా కన్పించిన ఆనంద్‌ను చూస్తూ మైమరిచింది. ఆనంద్ కళ్ళలో


ముందు ఆశ్చర్యం, ఆతర్వాతసంతృప్తి, ఆ తరవాత ఆరాధన, అనురాగం- యింతలో అప్పుడు తనకళ్ళు వాలి పోయాయి! 'సుజా!' ఆ పిలుపులో అనురాగానికి ప్రేమకి కంపించిపోయింది. మళ్ళీ తను తెలివి తెచ్చుకునేసరికి ఆనంద్ చేతుల్లోవుంది. ఆనంద్ గుండెల మీద తన తల! ఆనంద్ చేతులు తన చుట్టూ. ఆనంద్ పెదవులు తన పెదవుల మీద 'సుజా!' 'ఆనంద్' అంతకి తప్ప మరోమాట లేదు. ఒకరి కౌగిలిలో ఒకరు కరిగిపోయారు.

"ముద్దాయి సుజాత ఆరోజునించి ఆనంద్‌తో అక్రమసంబంధం కలిగి వుంది. వారిద్దరూ తరుచు ఆ హోటల్లో కలుసుకుంటుండేవారు" ప్రాసిక్యూటర్ గొంతు ఖంగుమంటుంది. కోర్టంతా నిశ్శబ్దంగావుంది అంటూ ఆసక్తిగా వింటున్నారు కథనం.

హు! అక్రమసంబంధం! తమిద్దరి మధ్యవున్న బంధాన్ని అక్రమసంబంధం అంటారని తరువాత తెలిసిందిగాని అప్పుడు తనకేంతెలుసు! తమిద్దరిది పవిత్ర ప్రేమ! తనదృష్టిలో పవిత్ర ప్రేమని లోకం అక్రమసంబంధంగా మాత్రమే గుర్తిస్తారన్న నిజం తనకి తెలియదు! నిజమే, పెళ్ళికాకుండా అంత తొందరపడకుండా వుండవలసింది! కాని.. కాని ఆనంద్‌ని చూస్తే మిగతా లోకం గుర్తురాలేదు. ఆనంద్ మాటలు వింటూంటే సంఘం, చుట్టూమనుష్యులూ వుంటారన్నదే గుర్తురాలేదు. ఆనంద్ చేతుల్లో కరిగిపోయేటప్పుడు నీతి నియమం అన్న పదాలే మరిచిపోయింది. ఆనంద్‌తో అనుభవం ముందు యీ వెధవ ప్రపంచం యీ మనుష్యులు ఎలాపోతే తనకెందుకు. అసలు యీ అనుభవం తర్వాత తనేమయిపోతేమాత్రం ఏం అన్పించిన క్షణాలు అవి - క్షణాలుకాదు, రోజులు, నెలలు!

"హతుడు ఆనందరావు వివాహితుడు యిద్దరు బిడ్డలతండ్రి అన్న విషయం ముద్దాయి సుజాతకి చాలారోజులవరకు తెలియదు."

చాలారోజులేమిటి! ఒక ఏడాది వరకు తను కలలోకూడా ఊహించని విషయం అది! అంత తెలివితక్కువగా ఎలా ప్రవర్తించింది. అంతలా తన కళ్ళు ఎలా మూసుకుపోయాయి! తనచదువు, లోకజ్ఞానం అన్నీ ఏమయిపోయాయి! అసలతను వివాహితుడో కాదో అడగాలని కూడా తట్టనంత మైకంలో పడిపోయింది. అసలతని పర్సనల్ లైఫ్ గురించి అడిగే, ఆలోచించే తీరిక తనకేది! అనుక్షణం ఆనంద్, ఆనంద్ ఉత్తరాలు, ఆనంద్‌తో మురిసినక్షణాలు, ఆనంద్‌తో గడపబోయే మధురక్షణాలకి ఎదురు చూడడం యివితప్ప మరో ఆలోచనలకి చోటేది! తప్పనిసరిగా ఉద్యోగానికి వెళ్ళడం. మిగతాసమయం అలా మంచం




మీద పడుకుని ఆనంద్ గురించి ఆలోచించడం! ఆనంద్ ప్రేమతో పిచ్చిదానిలా తయారయిన తననిచూసి ఇంట్లో ఆఫీసులో అంతా ప్రశ్నలు కురిపించడం ఆరంభించారు. ఏం చెప్పగలదు? చెప్పాల్సిన సమయం యింకా రాలేదనిపించేది! తను అలా అనుకుంటే యింట్లోవాళ్ళు, వూళ్లోవాళ్లు వూరుకోరు గదా! తల్లిదండ్రులకి అనుమానం, లోకుల గుసగుసలు ఆరంభమయ్యాయి! తనని యిరకాటంలో పడేశాయి. యింట్లో కట్టడి, పెళ్ళి ఏర్పాట్లు మొదలయాయి. తను తొందరపడాల్సిన సమయం వచ్చింది. ఆనంద్ అడగాల్సినమాట, అడుగుతాడని ఎదురుచూసినమాట_ఆఖరికి తనే అడగాల్సి వచ్చింది.

"ముద్దాయి హతునికి తనకిపెళ్ళి నిర్ణయిస్తున్నారని వెంటనే తమిద్దరూ వివాహం చేసుకోవాలని రాసిన ఉత్తరానికి హతుడు అప్పటివరకు దాచిన నిజాన్నితను వివాహితుడనని, ఇద్దరు పిల్లలతండ్రినన్న విషయం తెలిపాడు... ఆఉత్తరం చదివిన ముద్దాయి..."

హా...ఉత్తరం చదివి ఏమయిపోయింది ఆ రోజు?? సుజా, నా సుజా! ఏం రాయను, ఎలా రాయను? ఇన్ని రోజులుగా నీనించి దాచిన ఈ భయంకర నిజాన్ని చదివి నీవేమయిపోతావో ఊహించలేకపోతున్నాను. నన్ను క్షమించు అని అడిగే అర్హత కూడా నాకు లేదు. సుజా నేను వివాహితుడనని యిద్దరుపిల్లల తండ్రినని ఎలా చెప్పను? ఇది విని నీవు నన్నెంత ద్వేషిస్తావో ఊహించగలను. సుజా. నిజాన్ని నీతో

చెప్పలేని నా పిరికితనాన్ని, అసహాయతని క్షమించగలవా! అసలు నీవు నాకు ఉత్తరం ఎందుకురాయాలి! నీ ఉత్తరాలు నన్నెందుకు అలరించాలి. ముందు మర్యాదకి, తర్వాత ఆకర్షణకి లొంగి నీకుత్తరాలు రాయకం ఆ ఉత్తరాలు యింతదూరం మనిద్దరిని తీసుకువస్తాయని ఆనాడుతెలిస్తే రాసేవాడినిగానేమో! నీ ఉత్తరాలకి ఆకర్షితుడనై, నిన్ను చూసి మరింత ఆకర్షణకి లొంగిపోవడంలో నా నేరం ఎంత! నిన్ను ప్రేమించకుండావుండలేని బలహీనతకి లొంగిపోవడంలోనా నేరం ఎంత! నిన్ను చూసిన క్షణంనించి నన్నునేను మరిచిపోవడమూ నానేరమేనా! నిజం చెపితే నీవు దూరమయిపోతావన్న భయం, నిన్ను దూరం చేసికొని బ్రతకలేనన్న నిజం ఎప్పటికప్పుడు నానోరు కట్టేసేవి. అమాయకంగా మనసారా ప్రేమించిన వ్యక్తిని నమ్మి సర్వస్వం అర్పించిన నీ అమాయక ఆరాధన ముందు దోషిలా నిలవలేక గిజగిజలాడేవాడ్ని. నీతో గడిపిన ప్రతి మధురక్షణం వెనక నిన్ను మోసం చేస్తున్నానన్న బాధ నన్ను దహించేది! ప్రతిరోజు ప్రతిక్షణం నిన్నుగురించిన ఆలోచనలతో, నీ భవిష్యత్తుపట్ల నే నేనిర్ణయం తీసుకోవాలన్న విషయంమీద చింతతో నేనెంతగా మథనపడిందీ నా వ్యథ నాబాధ నీకర్థంకాదు, సుజా నన్ను అర్థంచేసికో! నేనేదో దారి వెతికేవరకు ఏ విషయంలోనూ తొందరపడకు - త్వరలో నిన్ను కలుసుకొని మాట్లాడుతాను-భవిష్యత్తునిగురించి ఏదో నిర్ణయానికి వద్దాం- నీ ఆనంద్.

నీ ఆనంద్ - నా ఆనంద్‌వి కదూ నువ్వు. ఆనంద్ నన్నెందుకిలా మోసం చేశావు. ఎందుకిలా నటించావు - నేనేం ద్రోహం చేశానని నన్నిలా శిక్షించావు. నిజం నాతో చెప్పకుండా దాచి నన్నెందుకిలా ప్రలోభంలో పడేశావు? ఉత్తరం చదివి ముందు నోటమాటలేక కాసేపు వుండిపోయింది. ఆ తరువాత కోపం, దుఃఖం, ఆవేశం, కసి, ఆవేదన, బాధ, అవమానం అన్నీ కలిసి తన భవిష్యత్తేమిటి అనే భయంతో భోరుమంది. ఎవరితో చెప్పుకోటం? ఏం చెయ్యడం? యింక తనగతేమిటి! తనబ్రతుకేమవుతుంది! తన సంగతి తెల్సిన తల్లితండ్రులేమవుతారు! తన సర్వస్వం అనుకున్న ఆనందే యిలా మోసంచేస్తే యింకెవరు తనని ఆదుకుంటారు ఆనంద్...ఆనంద్ ఆ దుఃఖం, ఆ బాధ అన్నీ ఆవేశంలో దింపి ఏదో కసిపెంచాయి. యుగయుగాలుగా ఆడది పురుషుడిచేతిలో మోసపోవడం అన్నది క్రొత్త సంగతికాదని తెలిసి తెలిసి భ్రమరం దీపందగ్గిరకి చేరితే అది నీ తప్పెలా అవుతుంది. యింత చదివి, యిన్ని చూస్తూ యింత సుళువుగా నీ మాటలు నమ్మి నాశనం అయిన నా అవివేకానికి నీ వెలా బాధ్య

డవు-ఆనంద్ ... గుండెలు కరిగేలా ఏడ్చింది. ఆ బాధలో ఆవేశంలో ఏదో చెయ్యాలి అన్న కసి పేరుకుంది.

“అతని ఉత్తరం చదివి ముద్దాయి తనని మోసంచేశాడన్న కసితో ఆవేశంతో ఆనందరావుని తిడ్తూ ఉత్తరం రాసింది.చాలా ఆవేశంగా, ఆ ఉత్తరంలో తనని మోసం చేసినందుకు, యింత కాలం యీ నిజాన్ని దాచి తనని విలాస వస్తువుగా వాడుకున్నందుకు, తనని యింతగా వంచించినందుకు క్షమించననీ నిన్ను చంపి నేను చచ్చి కక్ష తీర్చుకుంటానని కసిగా రాసింది.” ప్రాసిక్యూటర్ కథని అతి కుతూహలంగా వింటున్నారు అందరూ.

కక్ష-కసి-అవును, ఆ ఉద్దేశంతోనే ఉన్నపాటున యింట్లోవాళ్ళకికూడా చెప్పకుండా ఆనంద్ వూరువెళ్ళింది, టెలిగ్రాం యిచ్చి. తన ఉద్దేశం ఏమిటో, ఏం చెయ్యాలనుకుందో తనకే అర్థంకాని అయోమయఆవేశం!

“అన్నట్టుగానే ముద్దాయి సుజాత ఆనందరావు వూరువెళ్ళింది ఆనందరావుని ఆమె బసచేసిన హోటలులో కలుసుకుంది. అక్కడేం జరిగిందో వివరంగా తెలియదుగాని ముద్దాయి ఆవేశంతో ముందే అన్నప్రకారం, ముందే వేసుకున్న ప్లానుప్రకారం ఆనందరావుని హత్యచేసి కక్ష తీర్చుకున్నట్టు స్పష్టపడుతూంది. హతుని భార్య శ్రీమతి కమల కథనం ప్రకారం - భార్యాభర్తల మధ్య గతసంవత్సరంనుంచి మనస్పర్థలు పెరిగినట్లు దానికి కారణం భర్త జీవితంలో సుజాత ప్రవేశించడమేనని చెప్పింది ఆమె. మొదట్లో ఆమెకి యీ విషయం తెలియదు. ఆనందరావుకి రచయితగా అభిమానులనించి ఉత్తరాలు అందుకోడం అలవాటయిన విషయం గనక మొదట్లో అలాగే సుజాత ఉత్తరాలు అనుకున్నది ఆమె. వారిద్దరి పరిచయం ప్రేమగా మారిందన్న విషయం భార్యకి తెలిసిందగ్గిరనించి యిద్దరిమధ్య చాలా గొడవలు జరిగేవని ఆమె చెప్పింది. ఆమె ఏడ్చి గోలచేసినా అతను పట్టించుకోలేదు. పైపెచ్చు భార్యమీద చెయ్యి చేసుకునేవాడట. యింటిసంగతి పట్టించుకోకపోవడం, చీటికిమాటికి భార్యని కసరడం, పరధ్యానం, రాత్రింబగళ్లు సుజాత నామస్మరణతప్ప మరి లోకం లేనట్లుండే భర్తని ఏవిధంగా తిరిగి తన వైపు త్రిప్పుకోవాలో తెలియక ఆ యిల్లాలు మథనపడేది. ఆఖరికి ఆనందరావు హత్యజరిగినరోజు భార్యాభర్తల మధ్య చాలా గొడవ జరిగింది. ఆనందరావు సుజాతని తను ప్రేమించానని, ఆమెని అన్యాయం చెయ్యలేనని, ఆమె లేనివే తనకు బ్రతుకు లేదని ఆమెని రెండోభార్యగా వివాహం చేసుకుంటానని అందుకు భార్య అంగీకరించకపోతే ఆమె యిష్టంవచ్చినట్టు ఎక్కడికన్నా

వెళ్ళచ్చని భార్యాబిడ్డల ఖర్చుకి డబ్బు యిస్తానని అన్నాడట. దానికి కమలా దేవి ఎంతమాత్రం అంగీకరించనని అందట. దాంతో మాటామాటా పెరిగి సుజాతలేనిదే తనకు లోకంలేదని ఆమెకి ద్రోహం చేసేకంటె తను ప్రాణాలనే విడుస్తానని ఆవేశంగా చెప్పాడట. యింట్లో ఎప్పటిదో పిస్తోలు ఒకటి తీసి సుజాతని కలవడానికి బయలుదేరాడట."

సుజాత ఆశ్చర్యంగా వింటుంది. ఆనంద్...తన ఆనంద్ ని అపార్థం చేసు కుంది. ఆనంద్ తనకోసం ప్రాణాలన్నా అర్పించడానికి సిద్ధపడ్డాడు...ఆమె కళ్లు చెమర్చాయి-చాలు. తనకింక కావాల్సిం దేంలేదు.

"ఈ లోకంలో కలిసి బ్రతకలేని తామిద్దరూ పైలోకంలో హాయిగా బ్రతు కుదాం అని తెగేసి చెప్పాడట. కట్టు కున్న భార్యకి అప్పుడెలా వుంటుంది! తనముందే పరస్త్రీమీద తన ప్రేమ వెల్ల డిస్తూ ఆమెకోసం ప్రాణాలర్పిస్తానని చెపుతూంటే ఏ స్త్రీ ఆవేశపడదు? ఆమె ఆవేశపడి భర్తని దూషించింది. ఏడ్చింది, ఏంచేసి భర్తని దక్కించుకో వాలో అర్థంకాలేదు ఆమెకి. భర్త ఆవే శంలో ఏ అఘాయిత్యం చేస్తాడోనని భయపడి అతనితో కలియపడి పిస్తోలు లాక్కో-పోయింది. కాని అతను యీయ కుండా భార్యని త్రోసేసి-పిస్తోలు లాక్కున్నంతమాత్రాన చావదల్చు కుంటే మార్గం వుండదనుకోకు అంటూ వెళ్లి పోయాడట.

భర్త ఆవేశంలో ఏంచేస్తాడో అన్న భయంతో భార్య అతనికి తెలియకుండా వెంబడించి ఆహోటలుకి వెళ్లింది. కిటికీ దగ్గిర నిలబడిన భార్యకి లోపల సుజాత చాలా ఆవేశపరురాలై ఆనందరావుని దూషించడం, అతను ఆమెని శాంతపరచ డానికి నచ్చచెపుతూ బ్రతిమిలాడుతున్నా వినిపించుకోకుండా మోసగాడవంటూ దూషించి నీలాంటివాడు యింకా బ్రతికి వుంటేయింకెంతమందిని నాశనంచేస్తావో అంటూ ఆవేశంతో కమల తలుపులు తట్టి పిలిచేలోపలే పిస్తోలుతో వచ్చింది. శ్రీమతి కమలాదేవి కేకలువిని అందరూ వచ్చేసరికి ఆనందరావు రక్తపు మడు గులో వున్నాడు. సుజాత తెల్లపోతూ చూస్తూ నిల్చుంది చేతిలో పిస్తోలు పట్టుకుని."

సుజాత ప్రాసిక్యూటర్ కథనం వింటూ ఆశ్చర్యపోయింది... కమల చెప్పినకథనం విని ఆమె పెదాలమీద చిన్న నవ్వు మెదిలింది.

"యువర్ ఆనర్, యీ హత్య ముద్దాయి సుజాత మోసగింపబడ్డానన్న ఆవేశంతో ఆవేదనతో చేసినదని స్పష్ట పడుతూంది. ఆనందరావుని హత్య చెయ్యాల్సిన అవసరం, చేసే వీలు మరె వ్వరికీ లేదు. హతునిదగ్గిరవున్న పిస్తోలు ముద్దాయి పనిని మరింత సుళువుచేసింది.

యువ



ఆనందరావు మరణం ఆ పిస్తోలులోని రెండు గుళ్లవలననే అని స్పష్టపడు తూంది. పిస్తోలుమీదవున్న వేలిముద్రలు హతుడు, అతని భార్యవి కూడా వున్నాయి ఆనందరావు మరణం ఆ పిస్తోలులోని గుళ్లవల్లనే అని డాక్టరు రిపోర్టు తెలియచేస్తూంది. యువర్ ఆనర్ ముద్దాయి ఆవేశంలో చేసినదే అయినా నిలువునా నిండుప్రాణం తీయడం, ఓ భార్యకి భర్తని, పిల్లలకి తండ్రిని దూరంచేసిన ఆమె నేరం క్షమించరానిది. యువర్ ఆనర్, న్యాయం విచారించి ముద్దాయికి తగినశిక్ష విధించాలని కోరుతూ యింతటితో ముగిస్తున్నాను."

ప్రాసిక్యూటర్ కథనం ముగించి కూర్చున్నాడు. కోర్టులో కలకలం ఆరంభమయింది. జడ్జిగారు ఆర్డర్ అంటూ హెచ్చరించి ముద్దాయిపంక తిరిగాడు. ముద్దాయి తను చెప్పవలసింది ఏమన్నా వుందా? అని ప్రశ్నించారు

సుజాతని. సుజాత తలఎత్తి ఒక్క క్షణం చూసి తల అడ్డంగా తిప్పింది.

"అంటే ముద్దాయి తన నేరంఅంగీక రిస్తుందా ?...ఆమె చెప్పదలచింది ఏమీ లేదా ? ముద్దాయితరుపు లాయరు ఎవరూలేరా ? సుజాత మరోసారి తల అడ్డంగా తిప్పింది. కోర్టులో కలకలం ఆరంభమయింది. ఆనందరావు భార్య కమల అంత దుఃఖంలోనూ ఆశ్చర్యంగా చూసింది సుజాతవంక. సుజాతతండ్రి ఆరాటంగా నిలబడి ఏదో చెప్పబో యాడు. అంతలో ఒక నల్లకోటు లాయరుగారు ఆయన్ని కూర్చోమని తను లేచి తనని ఢిఫెన్సు లాయరుగా ముద్దాయితరుపున కేసు నడి పించడానికి ముద్దాయితండ్రి నియమించి నట్లు కేసు ప్రొసీడ్ అవడానికి జడ్జిగారి అనుమతి కోరుతున్నట్టు లాంఛన ప్రకారం చెప్పుకున్నాడు.

జడ్జిగారు అనుమతించడం, ఆయన కేసు విచారించడానికి ప్రారంభించడం, డాక్టరు రిపోర్టు, పోలీస్ యినస్పెక్టరు వాఙ్మూలం, హోటలుయజమాని వివరణ, హోటల్ బాయ్స్‌సాక్ష్యం-ఒక్కొక్కరిని బోనులో నిలబెట్టి ప్రశ్నలు, క్రాస్ ఎగ్జా మినేషన్స్-

ప్రతిరోజు ... అంతా వింటూంటే సుజాతకి ఏదో వినోదంగావుంది. తను చదివిన ఇంగ్లీషు డిటెక్టివ్‌నవల్లో మాదిరి ఏదో కథ చదువుతున్నట్టు కుతూ హలంగా అందరి సాక్ష్యాలు, వివరణలు వింది. అందరి సాక్ష్యాలూ తననేదోషిగా నిరూపిస్తున్నాయి! తనకి కావల్సిందదే! తన ఆనంద్‌లేని ప్రపంచంలో బ్రతకా లన్న కోరిక తనకులేదు! అసలింతకాలం ప్రాణం తీసుకుందామన్న వీలులేకుండా బంధింపబడ్డానన్నదే విచారం! హ - పిచ్చినాన్న. తననింకా రక్షించాలన్న తాపత్రయపడుతున్నాడు. లాయర్ల చుట్టూ తిరుగుతున్నాడు డబ్బు పోస్తు న్నాడు. నిజం చెప్పమ్మా, ఏం జరి గిందో చెప్పు అని బ్రతిమిలాడుతారు తల్లిదండ్రులు. నిజం! ఏం నిజం! తను చెప్పేదే నిజం? అంతకంటే ఏం చెప్పలే నంది. ఏం చెప్పలేదుకూడాను! తనకి ఒక్కటే కోరిక మిగిలింది. ఈ కేసు యిలా రోజులతరబడి నడవకుండా త్వరగా ముగిసి తన ఆనంద్ దగ్గిరకి తనని పంపిస్తే చాలు! తను స్పష్టంగా చెపుతూంటే యింకా తన లాయరు ఎందుకో తికమక ప్రశ్నలువేసి సాక్షుల ద్వారా ఏదో లాగాలని ప్రయత్నిస్తాడు.

ఆ రోజు ఆనందరావు భార్య కమల సాక్షిగా బోను ఎక్కింది. సుజాత ఆమెని పిలవగానే కుతూహలంగా విన సాగింది. కమలని చూడడం సుజాత కిదిరెండోమారు మాత్రమే! ఆ రోజు ఆనంద్ హత్యజరిగినరోజు ఆ గొడవలో ఆమెని సరిగా చూడలేదు. కమల అంద గత్తెకాదు. మామూలు సుమారుగాకూడా

లేదు. చామన ఛాయలో, పొట్టిగా, పీలగా పాతికేళ్ళలోపు వయసే అయినా అప్పుడే ఏదో వయసు మీదపడిన స్త్రీలా కన్పిస్తూంది. ఆనంద్‌లాంటి సౌందర్య పిపాసికి, ఆనంద్‌లాంటి భావుకుడు, ఆరాధకుడు యీమెని వివాహం ఎలా చేసుకున్నాడో! వివాహాలు స్వర్గంలో నిర్ణయం అవుతున్నాయన్నది, విధి లిఖితం అంటే యిదే గాబోలు! కమల ఈ కొద్దిరోజులలో చాలా మారిపోయింది. హఠాత్తుగా పైబడిన వైధవ్యం, ఆ దిగులు ఆ చింత, ఆ భయం ఆమెని ఎంత కృంగదీశాయో స్పష్టంగా తెలుస్తుంది. నల్లబడిన మొహంతో, అదురుతున్న పెదాలతో భయంభయంగా, బెరుకుగా తడబడ్తూ ఆమె చెప్పే మాటలు వినసాగింది సుజాత.

ఢిఫెన్సులాయరు అడిగే ప్రశ్నలు, కమల జవాబులు అన్నీ అప్పటివరకు ప్రాసిక్యూటర్ కథనంలో విన్నవే. ఆమెకి సుజాత విషయం తెలియడం అక్కడనించి వారి కాపురంలో కలతలు, అంతా ఆమె ఆవేశంగా, కోపంగా ఆవేదనతో చెప్తూంటే సుజాత నేరస్థురాలిలా తలవంచుకుంది! జరిగిందానికి తనెంత వరకు బాధ్యురాలు! ఆనంద్ వివాహితుడని తనకి తెలియకపోవడంవల్ల గదా యింత అనర్థం! ఢిఫెన్సులాయరు చాలా తెలివిగా ఆమెని తికమకపెట్టే ప్రశ్నలు అడిగి గాభరా పెడ్తున్నాడు. అసలే గాభరాగావున్న కమలకి ఆ ప్రశ్నలకి జవాబులు చెప్పేసరికి చెమటలు పడ్తున్నాయి. సుజాతకి విసుగేసింది. ఆమెకి కావల్సింది వినాలనుకుంటున్నది. ఆఖరిరోజు తనకు తెలియని, జరిగిన సంగతులు.

ఆఖరికి లాయరు ఆ ప్రశ్నకి వచ్చాడు. "శ్రీమతి కమలాదేవీ ఆఖరి రోజున అంటే మీ భర్తగారి హత్య జరిగినరోజు మీ యిద్దరి మధ్య చాలా గొడవ జరిగిందని, మీరు సుజాతతో వివాహానికి ఒప్పుకోకపోతే తనకి యీ బ్రతుకే అక్కరలేదని అన్నారని అన్నారు. తరువాత పిస్తోలు తీసుకుని బయలుదేరుతూంటే మీరు అడ్డగించారని చెప్పారు. ఆయన దగ్గరనించి పిస్తోలు తీసుకుని మీరు ఏంచేశారు...?"

"అబ్బే, నేనేం చేశాను. ఏం చెయ్యిందే, నేనేం చేశాను...కమల తడబడుతూ గాభరాగా, హడావిడిగా అంది. ఆమె వళ్ళంతా చెమటలుపట్టాయి

"అయితే మీరు మీవారినించి పిస్తోలు తీసుకున్నారన్న మాట!" లాయరు మొహంలో గర్వం తళుక్కుమంది.

అప్పటికి లాయరు ప్రశ్నలోని తికమక గ్రహించి గాభరాగా సర్దుకొంటూ–"అబ్బే ఆయన నాకివ్వందే, నేను ఎంత ప్రయత్నించినా ఆయన నన్ను త్రోసేసి వెళ్లిపోయారు."

"కమలాదేవీ, మీరు మీవారినించి ఆ పిస్తోలు తీసుకున్నారని...ఆయన అది


మీనించి తీసుకోడానికి పెనుగులాడారని మీరీయకపోతే అప్పుడు పిస్తోలు లేక పోతే చావదల్చినవారికి అనేక మార్గా లున్నాయని, నీవు నన్ను ఆపగలనను కుంటున్నావా అని విసురుగా వెళ్ళి పోయారని, ఆ తరువాత మీరు ఆవే శంతో, కోపంతో అవమానంతో కసితో ఆ పిస్తోలు తీసుకుని ఆయనని వెంబడించి హోటల్‌కి వెళ్లారని, అక్కడ కిటికీ దగ్గిర పొంచి మీ భర్త, సుజాత మధ్యల సంభాషణ అంతా వింటూ మీవారు సుజా తని బ్రతిమిలాడడం, తనకి భార్య లెక్కలేదని, ఆమె ఏమన్నాసరే తనను వివాహం చేసుకుంటానని, అలా జరగని పక్షంలో యిద్దరం కలిసే చనిపోదామని అనడం విని ఆవేశం, అసూయ భరించ లేక కిటికీ కర్టెనుతొలగించి సుజాతని చంపాలని, ఆమె పీడవదిలించుకుని మీ భర్తని దక్కించుకోవాలనుకున్నారు- కాని అలవాటులేక, చాతకాక గురితప్పి ఆ గుళ్ళు మీ భర్తగారికి తగిలాయి- అప్పటికిగాని మీరు చేసినన పని తెలిసి రాలేదు. కిటికీ గొంచి పిస్తోలు లోపలికి విసిరేశారు- అప్పుడు కేకలుపెట్టి నలు గురిని పిలిచారు. ...గంభీరంగా కమ లని చూస్తూ వేలుపెట్టి ఆమెని బెదిరిస్తు న్నట్టు తీక్షణంగా తన వాదం సాగిస్తు న్నాడు డిఫెన్సులాయరు.

"అబద్ధం ... అంతా అబద్ధం ..." అంటూ అరిచింది మధ్యలోనే కమల. ఆమె మొహం ఎర్రబడిపోయింది, ఆవే శంలో! గాభరాతో భయంతో ఆమెకి వణుకువచ్చింది...సుజాత ఆశ్చర్యంగా వింటోంది.

ప్రాసిక్యూటర్ ఒక్క ఉదుటున లేచి నిల్చుని "అబ్జెక్షన్ యువర్ ఆనర్, ఏ ఆధారమూ, ఏ సాక్ష్యమూ లేకుండా సాక్షిని కేవలం తికమకపెట్టి తప్పుదారి తొక్కించే యీ నేరారోపణకి అభ్యం తరం తెలియచేస్తున్నాను-" అన్నాడు.

జడ్జిగారు ఒక్క క్షణం ఆలోచించి అబ్జక్షన్ సస్టయిడ్ అన్నారు. డిఫెన్సు లాయరు సాక్షిమీద ఆరోపించిన ఆరో పణకి తగిన సాక్ష్యాలువుంటే చూపాలి అన్నారు.

యువర్ ఆనర్, సాక్ష్యం, ఆధారం చూపలేకపోయినా ఆనందరావుని చంప డానికి ముద్దాయికి ఎంత అవకాశం ఉందో, సుజాతని చంపి తనకి అడ్డు తొలగించుకోవాలని హతునిభార్య అను కుంటే ఆమెకీ అవకాశం వుందని చెప్ప డమే నా ఉద్దేశం-శ్రీమతి కమల హోట లుకి రావడం ఒక్క బాయ్‌మాత్రం చూశాడు సుజాత వుంటున్న గదినెంబరు అడిగింది. ఆ గది వరండా మలుపులో చివరవున్నగది కనక అక్కడ ఆమె నిల్చోడం, ఆమె ఏంచేసినా ఎవరికీ కని పించదు. ఆ సమయంలో అక్కడెవరూ లేరుకూడాను. యీ పాయింటు జడ్జిగారు గుర్తించాలని మనవి."




"అవచ్చు, కాని ఏ ఆధారమూలేని ఆరోపణ నిలవదు. నౌ యుకేన్ ప్రొసీడ్ విత్ యువర్ ఎగ్జామినేషన్ -అన్నారు" జడ్జి. డిఫెన్సు లాయరు ముఖం ఓడి పోయినట్లు అయింది. వున్న ఒకే అవ కాశం, సుజాతని నిర్దోషిగా నిరూపించ డానికి తనకున్న చిన్న ఆశ జారి పోయిందని నిరాశపడ్డాడు.

''నా తరువాయి సాక్షి ముద్దాయి సుజాత...అన్నాడు లాయరు. కమల నెత్తిమీద బరువు దిగిపోయినట్లు బ్రతుకు జీవుడా అన్నట్టు తేలిగ్గా ఊపిరి తీసుకుని బోను దిగింది.

"కుమారి సుజాతా ... ఆనందరావు హత్యజరిగినరోజు హోటల్‌గదిలో ఏం జరిగిందో వివరంగా చెబుతారా?... ఆనందరావుని ఆవేశంతో ఏమన్నారు..? కసిగా తూలనాడి దూషిస్తే ఆనందరావు ఏమన్నాడు.

హ...తను ఆనంద్‌ని తూల నాడిందా! దూషించిందా!...వూహ... అనుకుంది. కాని ఏ ఒక్కటీ చెయ్యలేక పోయింది ఆవేశంగా కసిగా నిందించా లనుకుంది. చెంప పగలగొట్టాలనుకుంది. నీచుడా అని మొహంమీద ఉమ్మేయా లనుకుంది...కాని యిందులో ఏదీ చెయ్య లేకపోయింది. ఆనంద్‌ని చూడగానే- అనంద్ మొహం-గుర్తుపట్టలేనంతగా నల్ల బడిపోయిన, సర్వస్వం పోగొట్టుకున్న ట్టున్న ఆమొహంలో బాధ, అకళ్ళల్లో ఆవే దన చూడగానే చలించిపోయింది అతను ఏమీ చెప్పనక్కరలేకుండానే తనకోసం అతను పడుతున్న వ్యధ ఎంతటిదో తెలి సింది. కసిగా తిట్టాలి అనుకున్న తను 'ఆనంద్' అంటూ బేలగా అరచి అతని గుండెలమీద వ్రాలిపోయి భోరుమంది. ఇరువురూ ఒకరిని హత్తుకుని ఒకరు రోధించారు...సుజా, నన్ను తిట్టు, కొట్టు చంపు, నీ యీ ప్రేమ, నీ క్షమ నేను భరించలేను. నీ యీ ఔదార్యానికి నేను తగను. చంటిపిల్లాడిలా ఏడుస్తున్న అతన్ని తను ఓదార్చవలసివచ్చింది.

సుజా పద ఎక్కడికైనా వెళ్లిపోదాం. యీ మనుష్యులు, యీ సంఘం, కట్టు బాట్లు ఏమీ లేనిచోటకి పోదాం. నీవుంటే నీవు నా ప్రక్కనవుంటే నరకమైనా సరే పరవాలేదు. సుజా నీకు నేనేం చెయ్యను. యింత అసమర్ధుడిని ఎందుకు ప్రేమిం చావు...తనని ఓదార్చి, సమాధాన పరచాల్సిన ఆనంద్ అంత జేలగా తనని కౌగలించుకుని ఏడుస్తూంటే ఆనంద్ ప్రేమ ఎంతటిదో తనని అభిషేకం చేస్తున్న ఆ కన్నీళ్లే తెల్పుతూంటే...అత నిని ఓదార్చడం తనవంతయింది.

'కుమారి సుజాతా...!' లాయరు కంచుకంఠం విని ఈ లోకంలోకి వచ్చి అయోమయంగా చూసింది. నా ప్రశ్న లకి సమాధానం చెప్పు. ఆ రోజు ఆవే శంతో ఆనంద్‌ని ఏమన్నావు. ఆనంద రావు ఏమన్నాడు. ఏం జరిగింది ఆ వివ రాలు చెప్పమని అడుగుతున్నాను...నా ప్రశ్నకీ సమాధానం చెప్పు...

కోర్టంతా నిశబ్దంగా కుతూహలంగా సుజాత జవాబుకి ఎదురుచూస్తూంది. కమల ఆరాటంగా ఆమె జవాబుకి ఎదురుచూస్తూంది. సుజాత నెమ్మదిగా శుష్కహాసం చేసింది.

"చెప్పడానికి ఏముంది. ఆనంద రావుని ఏమంటాను. ఓ మోసపోయిన వంచించబడిన స్త్రీ ఆ బాధలో ఆవేశంలో ఏం అంటుంది? మోసగాడివన్నాను. యింత నీచుడవనుకోలేదు. నాకు చేసిన అన్యాయానికి ఎక్కడోకాదు యిక్కడే నాచేతిలోనే శిక్ష అనుభవిస్తావు అని కసిగా నిందించాను

"ఆనందరావు అప్పుడు ఏమన్నాడు?

"ఏమంటాడు! దోషిలా తలవంచు కున్నాడు! నిర్దోషిలా అమాయకంగా మొహంపెట్టాడు ...క్ష మి ం చ మ ని ప్రాధేయపడ్డాడు నిన్ను యింట్లోవుంచు కుంటాను, నీ కన్యాయం చెయ్యనన్నాడు. ఉంపుడకత్తెగా వుంచుకుంటావా అని వికటంగా నవ్వాను. రెండో పెళ్ళికి తన భార్య వప్పుకోడంలేదని నెమ్మదిమీద తప్పిస్తానని నచ్చచెప్పబోయాడు. అతని మొహం చూస్తుంటే అదంతా నన్ను ఆప్పటికి తప్పించుకోడానికి ఆడుతున్న నాటకం అని అర్థంచేసుకున్నాను... అలాంటి మనిషిని - అలాంటి నీచుడిని వదిలిపెట్టకూడదని ఆవేశపడి ఆ ఆవే శంలో...

"ఏం చేశావు?

"ఆ ఆవేశంలో పిస్తోలు కాల్చాను"

"నీకు పిస్తోలు ఎక్కడిది?"

"ఆనందరావ్ తెచ్చాడు నన్ను నమ్మించడానికి. సుజాతా, నన్ను నమ్మ లేకపోతే యిదిగో నీ చేతుల్తోనే నన్ను చంపి నీ కసి తీర్చుకో అంటూ గొప్పగా పిస్తోలు అందించాడు...అతను వూరికే అన్నది నేను నిజంచేశాను. ఆనంద రావుని కాల్చాను...

"ఆనందరావుని చంపితే నీకు శిక్ష

పడుతుందని నీవు తప్పించుకోలేవనీ తెలుసుండే ఆ పనిచేశావా ?...

"అవును, ఆనంద్ లేని బ్రతుకు నా కక్కరలేదని, ఆనంద్‌లేని క్షణాన నేను వుండరాదని, ఆనంద్‌ని చంపి నేను చావాలనుకున్నాను. కాని యీలోగానే అతనిభార్య కేకలుపెట్టడం, అంతా రావడంతో నేను గాభరాపడిపోయి నన్ను నేను చంపుకోవాలన్నది మరిచిపోయి వుండిపోయాను. యువర్ ఆనర్. దయచేసి నన్నింకా యిలా నా ఆనంద్‌నించి దూరంచేసి బాధించకండి. దయచేసి నా ఆనంద్ దగ్గరకి నన్ను పంపండి. నన్నింక ఎవరూ ఏమీ అడగవద్దు. నేనింకేమి చెప్పను. యువర్‌ఆనర్, నన్ను ఖైదుచేసి బ్రతుకంతా ఆనంద్‌కోసం ఏడిచేట్టు చెయ్యొద్దు. నా మీద దయదలచి నన్ను ఆనంద్ దగ్గరకు పంపండి. అంతకంటె నేను 'కోరుకునేది ఏమీలేదు, ఆవేశంతో, దుఃఖంతో సుజాత చేతులలో మొహం కప్పకుంది.

కోర్టులో కలకలం, గోలగోలగా తయారయింది. సుజాతతండ్రి వెలవెలబోయాడు. డిఫెన్సులాయరు ముద్దాయి తన నేరాన్ని అంతలాతెల్సేసి చెప్పతూంటే ఆమెని ఎలా రక్షించాలో తెలియక గాభరాపడిపోయాడు. కేసు వాయిదా కోరాడు. ఆరోజుకి టైము అయిపోవడంతో జడ్జిగారు మర్నాటికి కేసువాయిదావేసి లేచిపోయారు. జనం అంతా గోలగోలగా సుజాతకి ఏ శిక్ష పడబోయేది చర్చిస్తూ బయటికి వెడుతున్నారు. అంతవరకు నిశ్చేష్ఠురాలిలా కూర్చున్న కమల తేరుకుని ఒక్క ఉదుటున లేచి సుజాత దగ్గరకు రాబోయింది. పోలీసుకస్టడీలో వెడుతున్న సుజాతతో మాట్లాడలేక నిస్సహాయంగా వుండిపోయింది.

* * *

మర్నాడు పోలీసు పెర్మిషన్ తీసుకుని సుజాతని చూడడానికి వెళ్ళింది కమల. సుజాతని చూస్తూనే ఆరాటంగా ఆమె చేతులు పట్టుకుని...నన్ను క్షమించు, క్షమించాలను సుజాతా....నీదింత గొప్ప హృదయమని తెలుసుకోలేక ... ఆమె చేతులతో మొహందాచుకుని వెక్కివెక్కి ఏడవసాగింది కమల. ఆమె గుండెలలో భారం అంతా దిగిపోయేట్టు. ఆమె దుఃఖం అర్థం అయింది సుజాతకి. గుండెలు పగిలేలా ఏడుస్తున్న కమల భుజాలమీద ఓదార్పుగా చెయ్యివేసింది సుజాత... యిందులో నా గొప్పతనం ఏమీలేదమ్మా. ఏదన్నావుంటే అది ప్రేమ గొప్పతనం మాత్రమే. నా ఆనంద్ పిల్లలికి తండ్రి ఎలాగూ లేడు. తల్లినికూడా లేకుండాచేసి వాళ్ళని అనాధలు చెయ్యగలనా...సుజాత కళ్ళలో వెలుగుని ఆమె మొహంలో వెల్లివిరుస్తున్న సంతృప్తిని తెల్లపోతూ అర్థం కానట్టు చూసింది కమల!

---